క్లుప్తంగా

రైతులకు విత్తనాల పంపిణీ



కైలాసపట్నంలో విత్తనాలు తీసుకుంటున్న రైతులు

కోటవురట్ల: కైలాసపట్నంలోని రైతు సేవా కేంద్రంలో శుక్రవారం విత్తన పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ వి.కుమార్ ఆధ్వర్యంలో రైతులకు వరి విత్తనాలు అందజేశారు. ఏవో సరోజిని మాట్లాడుతూ మండలానికి ఖరీఫ్ సీజనుకు 808 టన్నుల వరి విత్తనాలు వచ్చాయని తెలిపారు. అన్ని రైతు సేవా కేంద్రాలలో వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఏడీఏ జాహ్నవి బాధ్యతల స్వీకరణ



విధుల్లో చేరుతున్న ఏడీఏ కంటా జాహ్నవి

యలమంచిలి రూరల్: యలమంచిలి వ్యవసాయ సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా కంటా జాహ్నవి శుక్రవారం ఇక్కడి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. చింతపల్లి వ్యవసాయ సంచాలకులుగా పని చేస్తున్న ఈమె బదిలీపై ఇక్కడకు వచ్చారు. యలమంచిలి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో ఏవోలు, సిబ్బంది ఆమెకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. వ్యవసాయ శాఖ తరఫున రైతులకు మెరుగైన సేవలందించేలా చూస్తానని ఆమె తెలిపారు.

కె.వెంకటాపురంలో పారిశుధ్య డ్రైవ్



కె.వెంకటాపురంలో చెత్తను సేకరిస్తున్న కార్మికుడు

కోటవురట్ల: కె.వెంకటాపురంలో శుక్రవారం పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పారిశుధ్య కార్మికులు వీధుల్లోని చెత్తను సేకరించి గ్రామ శివారుకు తరలించారు. కాలువల్లో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న కారణంగా ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వర్షాలతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పారిశుధ్య మెరుగుకు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు యూనిఫాం అందజేత



విద్యార్థులకు యూనిఫాం అందిస్తున్న ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం: స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు శుక్రవారం యూనిఫాంను ప్రధానోపాధ్యాయుడు వీసం ప్రసాద్ అందజేశారు. ప్రభుత్వం సమకూరుస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కె.నాగు, వైస్ చైర్‌పర్సన్ ఎం.నాగరత్నం, ఉపాధ్యాయులు హైమావతి, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

యలమంచిలి రూరల్: యలమంచిలి పట్టణంలో బీజేపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బొద్దపు శివ, నియోజకవర్గ కో కన్వీనర్ నక్కా శివశంకర్రావు, గుర్రాల నగేష్ పాల్గొన్నారు.

ఈఎస్ఐ ఆస్పత్రి పనుల పరిశీలన

అచ్యుతాపురం: అచ్యుతాపురం సెజ్‌లో నిర్మిస్తున్న ఈఎస్ఐ ఆస్పత్రి పనులను ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ మేరకు నిర్మాణ పనుల్ని పర్యవేక్షించారు. నాణ్యతతో పాటు సాధ్యమైనంత వేగవంతంగా పనులు పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఆస్పత్రి పనులు చేస్తున్న కార్మికులకు దోమ తెరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శివారు గ్రామాల్లో సమస్యల తిష్ట

- శిథిలమైన రోడ్లు, కాలువలు
- వీధుల్లో పిచ్చి తుప్పలతో భయాందోళన
- పట్టించుకోని అధికారులు



చెల్లాపురంలో ఓ వీధిలో పిచ్చితుప్పలు, రోడ్డుపై నిలిచిన నీరు



చెల్లాపురంలో పాడైన కుళాయి నుంచి వృథాగా పోతున్న తాగునీరు

ఎస్.రాయవరం: శివారు గ్రామాల్లో సమస్యలు తిష్ట వేశాయి. అధ్వాన రోడ్లు, పాడైన కాలువలు, క్షీణించిన పారిశుధ్యం వేధిస్తున్నాయి. మండలంలో 28 పంచాయతీలు ఉన్నాయి. దార్లపూడిలో రెండు శివారు గ్రామాలు, పెదగుమ్ములూరురికి రెండు, గుడివాడకు రెండు, గుర్రాజుపేటకు ఒకటి, వాకపాడుకు రెండు, ఎస్.రాయవరానికి ఒకటి, పెనుగొల్లుకు రెండు, వమ్మవరానికి ఒకటి, తిమ్మాపురానికి రెండు, రేవుపోలవరానికి ఒకటి, పెదఉప్పలానికి రెండు, లింగరాజుపాలెంకు ఒకటి, జేవీపాలెం గ్రామానికి ఒకటి, సైతారుపేటకు ఒకటి చొప్పున మొత్తం 21 శివారు గ్రామాలు ఉన్నాయి. ప్రధాన గ్రామాల్లో సమస్యలపై అధికారులు దృష్టి సారిస్తున్నారు తప్ప, శివారు గ్రామాలపై కినుకు వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నెలల తరబడి ఆయా గ్రామాల్లో పర్యటించిన సందర్భాలు లేవు. దీంతో గ్రామాల్లో పిచ్చి తుప్పలు, చెత్త, తాగునీటి సమస్యలు పేరుకుపోయాయి.

- దార్లపూడి శివారు చెల్లాపురంలోని వీధుల్లో పిచ్చి తుప్పలు పెరిగిపోయాయి. రోడ్డు, కాలువలు పాడైపోయాయి.
- ఎస్.రాయవరం శివారు అగ్రహారం గ్రామానికి సరైన రోడ్డు మార్గం లేదు. తాగునీటి సరఫరా వంటి సమస్యలు తరచూ వేధిస్తున్నాయి.
- బంగారమ్మపాలెంలో నిత్యం తాగునీరు, పారిశుధ్య సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. పరిష్కారానికి ఎన్ని దఫాలు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న నాథుడు లేరని గ్రామస్తులు చెబుతున్నారు.
- వాకపాడులో 3 వేలకు పైగా జనాభా ఉన్నప్పటికీ అధికారులు ఈ గ్రామంలో పర్యటించేందుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు.
- తిమ్మాపురం శివారు గోకులపాడు రోడ్డు అధ్వానంగా తయారైంది. డ్రైనేజీ సమస్య ఎక్కువగా ఉంది. వమ్మవరం శివారు అగ్రహారంలో సురక్షితమైన తాగునీరు అందక గ్రామస్తులు నిత్యం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- పెదఉప్పలం శివారు గ్రామాల్లో చినఉప్పలం, పిట్లం గ్రామాల్లో వీధి లైట్ల నిర్వహణ అధ్వానంగా ఉంది. గ్రామంలో ఎవరో ఒకరు ఆ పని చేస్తేనే ఇక్కడ వెలుగులు ఉంటాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి శివారు గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

ఫిర్యాదు చేసిన ఫలితం లేదు..



వాకపాడు శివారు బంగారమ్మపాలెం గ్రామంలో చాలా సమస్యలు ఉన్నాయి. వీధి రోడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. చినుకు పడితే చిత్తడిగా మారుతున్నాయి. కాలువల్లో చెత్త పేరుకుపోవడంతో దోమలు బాగా వ్యాప్తి చెందాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. జిల్లా అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలి.

– మైలపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్, వాకపాడు పంచాయతీ

సమస్యలపై స్పెషల్ డ్రైవ్‌లు



గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాం. ఇకపై శివారులు గ్రామాల్లో కూడా పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం. తమ దృష్టికి వచ్చిన సమస్యలపై వెంటనే స్పందిస్తున్నాం.

– సత్యనారాయణ, ఇన్‌చార్జ్ ఎంపీడీవో, ఎస్.రాయవరం మండలం

వెంకన్న ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న దాతలు

మునగపాక: మునగపాక బైపాస్ రోడ్డులో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రూ.5 కోట్ల వ్యయంతో ఆలయ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పలువురు భక్తులు ఆలయ నిర్మాణానికి సహకారం అందిస్తున్నారు. దీనిలో భాగంగా మునగపాకకు చెందిన కాండ్రేగుల హేమంత్ తనవంతు సాయంగా రూ.5,116 నగదును విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఆడారి అచ్చియ్యనాయుడు, కోనపల్లి రామ్మోహనరావు, ఆడారి లక్ష్మణరావు, ఆడారి రమణబాబు, కేవీఎస్ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి హాజరుకండి



శ్రీనివాసరావు

కోటవురట్ల: అనకాపల్లిలో శనివారం జరిగే వైఎస్సార్ సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి పార్టీ నాయకులు హాజరు కావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అనకాపల్లిలోని రింగు రోడ్డు వద్ద బెల్లం మార్కెట్ ఎదురుగా ఉన్న పెంటకోట కన్వెన్షన్ హాల్‌లో మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం జరుగుతుందని తెలిపారు. అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలన్నారు.

ఉద్దండపురంలో విద్యుత్ లైన్ల మార్పు

సాక్షి ఎఫెక్ట్..



ఉద్దండపురంలో ఇళ్ల మీద నుంచి ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లు మార్చిన దృశ్యం

నక్కపల్లి: మండలంలో ఉద్దండపురంలో ఇళ్ల మీద నుంచి వెళ్తున్న విద్యుత్ లైన్లను ట్రాన్స్‌కో అధికారులు ఎట్టకేలకు దూరంగా మార్చారు. యాదవపేట, ఎస్సీ కాలనీల్లో విద్యుత్ లైన్లు పలువురి ఇళ్ల మీద నుంచి ఏర్పాటు చేశారు. బాధితులు ఇళ్లు నిర్మించుకునేందుకు ఈ లైన్లు అడ్డురావడంతో దూరంగా మార్చాలని ట్రాన్స్‌కో అధికారులను కోరారు. షిఫ్టింగ్ చార్జ్ చెల్లిస్తే మార్చడం జరుగుతుందని చెప్పడంతో గ్రామానికి చెందిన పులి మార్తమ్మ, కొర్రా అప్పారావు ట్రాన్స్‌కోకు షిఫ్టింగ్ చార్జ్ చెల్లించారు. దాదాపు 45 రోజులు గడుస్తున్నా లైన్లు మార్చలేదు. బాధితులు వెళ్లి అడిగితే మెటీరియల్ లేదని, వచ్చిన తర్వాతే మార్చుతామని సంబంధిత ఏఈ సమాధానమిచ్చారు. స్లాబ్ కోసం సెంటరింగ్ చేసి రోజులు గడుస్తున్నా లైన్లు మార్చకపోవడంతో ఆర్థిక భారం పడుతోందని లబ్ధిదారులు వాపోయారు. ఈ సమస్యను స్థానిక ఎంపీటీసీ సభ్యుడు బచ్చలరాజు ద్వారా సాక్షి దృష్టికి తీసుకురావడంతో ఈ నెల 25న ట్రాన్స్‌కో నిర్లక్ష్యం.. ఆగిన ఇళ్ల నిర్మాణం అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ట్రాన్స్‌కో అధికారులు శుక్రవారం ఇళ్లపై నుంచి వెళ్తున్న వైర్లను దూరంగా ఏర్పాటు చేశారు. బాధితులు ఇళ్ల నిర్మాణాలకు ఎటువంటి అడ్డంకి లేకుండా చర్యలు చేపట్టారని ఎంపీటీసీ రాజు తెలిపారు. బాధితుల సమస్య పరిష్కారానికి కృషి చేసిన సాక్షి పత్రికకు, ట్రాన్స్‌కో అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

ఉపాధి పనులపై ప్రజావేదిక నేడు

పాయకరావుపేట: జాతీయ ఉపాధి హామీ పథకం కింద మండలంలో చేపట్టిన పనులపై శనివారం ప్రజావేదిక నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎ.జయప్రకాష్‌రావు తెలిపారు. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి నెల వరకు, అదే విధంగా 2025లో జూన్ నెలలో చేసిన ఉపాధి పనులపై ఆయా గ్రామాల్లో సిబ్బంది ఇప్పటికే ఆడిట్ నిర్వహించారన్నారు. మండలంలో అన్ని గ్రామాల్లో చేపట్టిన పనులపై రికార్డుల నమోదు, చెల్లింపులు విషయంలో జరిగిన సమస్యలపై ప్రజావేదికలో చర్చించనున్నట్టు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉదయం 10 గంటలకు ప్రజావేదిక ప్రారంభమవుతుందని ఎంపీడీవో తెలిపారు.

ఘనంగా జగన్నాథుని నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



మునగపాకలో జగన్నాథ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



జగన్నాథుని రథం లాగుతున్న భక్తులు

మునగపాక: మునగపాక, నాగులాపల్లి గ్రామాల్లో శుక్రవారం బలరామ సుభద్ర సమేత జగన్నాథ స్వామి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆయా గ్రామాల్లో భక్తులు ఉదయం నుంచి జగన్నాథుని దర్శించుకునేందుకు భారీగా తరలివచ్చారు. మునగపాకలో జగన్నాథస్వామి ఆలయం నుంచి విగ్రహాలతో రథయాత్రను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రథయాత్రలో కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ రథయాత్రను జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, సర్పంచ్ దిమ్మల అప్పారావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కోనపల్లి రామ్మోహనరావు తదితరులు ప్రారంభించారు. ముందుగా జగన్నాథ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఊరేగింపు నందీశ్వర ప్రాంగణంలోని జగన్నాథుని ఆలయం నుంచి ప్రారంభమై గ్రామంలోని అన్ని వీధుల మీదుగా సాగి బైపాస్ రోడ్డులోని ఆలయానికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బొడ్డేడ జగ్గారావు, విల్లూరి జగన్నాథం, పొలమరశెట్టి అప్పలనాయుడు, వెలగా వెంకటప్పారావు, కాండ్రేగుల జగ్గప్పారావు, భక్తులు పాల్గొన్నారు. తొలిరోజున జగన్నాథుడు మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

మందులతో ఆరు నెలల్లో క్షయ వ్యాధి నివారణ



పోషకాహార కిట్లు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌వో బాలాజీ

అచ్యుతాపురం: క్షయ వ్యాధి ప్రమాదకరం కాదని, ప్రభుత్వం ఉచితంగా అందజేసే మందుల్ని ఆరు నెలల పాటు వాడితే నయమవుతుందని డీఎం అండ్ హెచ్‌వో బాలాజీ తెలిపారు. అచ్యుతాపురం టీబీ యూనిట్ పరిధిలో శుక్రవారం పరవాడకు చెందిన లూపిన్ ఫార్మా కంపెనీ సహకారంతో సమకూర్చిన పోషకాహార కిట్లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తులకు మనోధైర్యం కలిగించాలన్నారు. అచ్యుతాపురం టీబీ యూనిట్ పరిధిలోని 40 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు ఆయన కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శ్రావ్య, సూపర్‌వైజర్ వెంకటరమణ, హెల్త్ అసిస్టెంట్ అప్పలకొండ, లూపిన్ కంపెనీ సైట్ హెడ్ విక్టర్ పాల్గొన్నారు.

ఉప్పటేరులో మళ్లీ చేపల మృత్యువాత



మృతి చెందిన చేపల్ని చూపిస్తున్న మత్స్యకార నేత

అచ్యుతాపురం: మండలంలోని పూడిమడక ఉప్పుటేరులో చేపలు మళ్లీ మృత్యువాతకు గురయ్యాయి. ఫార్మా పరిశ్రమల వ్యర్థాలను ఉప్పుటేరులోకి నేరుగా వదిలేయడంతో తరచూ చేపలు మృత్యువాత పడుతున్నాయి. దీనిపై ఇటీవల మత్స్యకారులు ఆందోళన చేసినా ఎటువంటి ప్రయోజనం లేదని మత్స్యకార నాయకుడు చేపల తాతయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఫార్మా వ్యర్థాలను నేరుగా ఉప్పుటేరులోకి విడిచిపెట్టకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరంలో సేవలను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: మునగపాకలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మునగపాకకు చెందిన దాడి గణేష్ జ్ఞాపకార్థం మునగపాకలో అతని కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ ప్రారంభించారు. గణేష్ బెస్ట్ మార్కెట్, గణేష్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త నిర్వహణలో అచ్యుతాపురానికి చెందిన శ్రీవిష్ణు పోలీక్లీనిక్ వైద్యులు వైద్య సేవలందించారు. అధిక సంఖ్యలో గ్రామస్తులు తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఇటువంటి శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సీజన్‌లో ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు దాడి శ్రీరామమూర్తి, టిక్కలి దేవకీరావు, దాడి సాంబశివ పాల్గొన్నారు.

రైతులకు విత్తనాలు అందుబాటులో ఉండాలి

జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు



గోదాములో విత్తనాలు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి మోహన్‌రావు

నక్కపల్లి: రైతులందరికీ విత్తనాలు అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు సూచించారు. శుక్రవారం ఆయన మండలంలో నక్కపల్లి, కాగిత, చినదొడ్డిగల్లు, తదితర గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలను తనిఖీ చేశారు. అక్కడ గోదాముల్లో ఉన్న విత్తనాల నిల్వలను పరిశీలించారు. ఏయే కేంద్రంలో ఎంత మేరకు విత్తనాలను అందుబాటులో ఉంచారనే విషయాన్ని స్థానిక ఏవో ఉమాప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. మండలంలో 950 క్వింటాళ్ల వరి విత్తనాలను వివిధ ఆర్‌ఎస్‌కేలలో అందుబాటులో ఉంచినట్టు ఉమాప్రసాద్ తెలిపారు. శ్రీకాకుళం సన్నాలు, ఆర్‌జీఎల్ 2537తో పాటు, మేలైన మార్టేరు రకాలు కూడా వేసుకునేలా రైతుల్లో అవగాహన కల్పించాలని మోహన్‌రావు సూచించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై వర్షాలు విస్తారంగా పడుతున్న నేపథ్యంలో రైతులకు అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచడంతో పాటు, పొలంబడి కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ఆర్‌ఎస్‌కేల్లో సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. విత్తనాల కోసం రైతులు తమ ఆధార్‌లను అనుసంధానం చేసుకోవాలన్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను ఉపయోగించేలా రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని, యాంత్రీకరణపై రైతులకు పూర్తి స్థాయిలో చైతన్యం తీసుకురావాలన్నారు. రాయితీపై సరఫరా చేసే యంత్ర పరికరాల గురించి రైతులకు వివరించాలన్నారు. ఈ తనిఖీల్లో ఏపీసీడ్స్ డీఎం సాయి, ఏఈవో సాయికుమారి, ఆర్‌ఎస్‌కే సిబ్బంది నాయుడు, మోహన్‌రాజేష్, రైతులు పాల్గొన్నారు.

కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి

నర్సీపట్నం: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నర్సింగరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల దీక్షా శిబిరాన్ని ఆయన శుక్రవారం సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక ఏళ్లుగా పని చేస్తున్నా పర్మినెంట్ చేయకుండా ఔట్‌సోర్సింగ్ పేరుతో శ్రమను దోచుకుంటున్నారని విమర్శించారు. కార్పొరేట్లకు సేవలందిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై అశ్రద్ధ వద్దు



మంగవరంలో పారిశుధ్యంపై సిబ్బందికి సూచనలు చేస్తున్న డీపీవో సందీప్

పాయకరావుపేట: గ్రామాల్లో పారిశుధ్యంపై ఆయా సచివాలయాల సిబ్బంది అశ్రద్ధ చేయవద్దని జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) ఈ.సందీప్ ఆదేశించారు. మండలంలోని మంగవరం గ్రామంలో ఆయన శుక్రవారం పర్యటించారు. గ్రామంలో పారిశుధ్యంపై సిబ్బంది తీసుకుంటున్న చర్యలపై గ్రామ సచివాలయ సిబ్బందిని ఆరా తీశారు. అనంతరం గ్రామంలో తాగునీటి సరఫరాపై ఆరా తీశారు. అలాగే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. చెత్త నుంచి సంపద కేంద్రాలను నిర్లక్ష్యం చేయకుండా అభివృద్ధి చేయాలని సిబ్బందికి సూచించారు. తడి, పొడి చెత్త సేకరణ పక్కాగా జరగాలన్నారు. గ్రామంలో ఇంటి పన్నుల వసూలు చేపట్టాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. ఎంపీడీవో ఎ.జయప్రకాష్‌రావు, సర్పంచ్ వంగలపూడి సరస్వతీ రామారావు, మాజీ సర్పంచ్ దేవవరపు ఆనంద్‌కుమార్, ఎంపీటీసీ గూటూరు విజయలక్ష్మి రామగోవిందు, గ్రామ కార్యదర్శి వై.వి.సత్యనారాయణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

త్వరితగతిన పీఎంఏవై ఇళ్లు పూర్తి

మాకవరపాలెం: పీఎం ఆవాస్ యోజన గృహాల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ శ్రీఫణి సూచించారు. తామరంలో శుక్రవారం ఇళ్ల లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి నిర్మాణాలు పూర్తి చేయాలని, లేకుంటే నిధులు మంజూరయ్యే అవకాశం లేదన్నారు. అనంతరం స్థానిక హౌసింగ్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. దశలవారీగా ఇళ్ల నిర్మాణం చేసిన లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్లు జగన్నాథం, శ్రీను పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాయకరావుపేట: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని అనకాపల్లి ఏపీఈపీడీసీఎల్ ఈఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈదటం, పాల్మన్‌పేట ఫీడర్ల పరిధిలోని ఈదటం, కందిపూడి, పాల్మన్‌పేట, కొర్లయ్యపేట, రాజయ్యపేట, శ్రీరాంపురం, కేశవరం, రాజవరం, గజపతినగరం గ్రామాలకు, కుమారపురం ఫీడర్ పరిధిలోని కుమారపురం, రాజగోపాలపురం, కందిపూడి గ్రామాలకు ఉదయం 9 నుంచి 5 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో విద్యుత్ లైన్ల క్లియరెన్సు, ఫీడర్లలో మరమ్మతులు చేపట్టనున్నట్టు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఎస్.రాయవరం: గుండ్రుబిల్లి సబ్‌స్టేషన్ ఎస్.రాయవరం ఫీడర్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. లైనులో చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా ఉప్పరాపల్లి, వెంకటాపురం, లింగరాజుపాలెం, జేవీపాలెం, సర్వసిద్ధి, కర్రివానిపాలెం, బసవపాడు, సైతారుపేట, వాకపాడు గ్రామాలకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాయకరావుపేట డివిజన్:
9951602901
Office mail : sakshiadvtvsp@gmail.com